# ఆయన సత్యాన్వేషి

బాలగోపాల్ మాటకారి కాదు. చమత్కారి అంతకన్నా కాదు. నాకతనితో గాఢమైన మైత్రి లేదు. అసలతడు స్నేహపాత్రుడు కూడా కాదు. ఆయన రాసిన ప్రతిమాటనూ శిరసున దాల్చే భక్తి గాని భావాలపరంగా ఆయనతో సంపూర్ణమయిన ఏకీభావంగాని లేవు. అయినా అతడు పోయాడని తెలిసిన క్షణం నుంచీ మనసంతా దిగులుగా ఉంది. అతని లేని లోటు పూడ్చలేనిదనేది మరింత స్పష్టంగా అర్థమవుతోంది. ఈ మాట నేను రొటీన్‌గా చెప్పడం లేదు. అది నూటికి నూరుపాళ్లు నిజం. అందుకే దిగులు.

బాలగోపాల్ ఒక ప్రత్యేకమైన వ్యక్తి. బాలగోపాల్ లాంటి వాడు ఆంధ్రప్రదేశ్‌లో బాలగోపాల్ ఒక్కడే అనిపిస్తుంది. అతని ప్రత్యేకత అతని భావాల్లో ఉందనుకోను. అతని నడవడికలో ఉంది. అతని వ్యక్తిత్వంలో ఉంది. నిజం విషయంలో అతనికున్న నిబద్ధతలో ఆ ప్రత్యేకత ఉంది. నమ్మిన నిజానికి కట్టుబడి ఉండడం అన్నది పైకి కనిపించినంత తేలిక వ్యవహారం కాదు. పైగా బాలగోపాల్ అలా కట్టుబడి ఉండడటమేగాక, ఆ సూత్రాన్ని ఆయన ఎంత సహజంగా ఎంత సాదాసీదాగా ఎంత స్పష్టంగా స్వీకరించాడో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

జనంలో ఎక్కువ మందికి తామూ తమ కుటుంబమూ తప్ప వేరే ప్రపంచం ఉండదు. వారికి వారి ఈతి బాధలు, వారి కష్టం, వారి సుఖం, వారి సంపాదన ఇవే తెలుసు. వాటికి సంబంధించినంత వరకే సమాజంతో వారి సంబంధం మొదలవుతుంది. అక్కడే అది అంతమౌతుంది. అది సహజం. అందులో తప్పుపట్టాల్సిందేమీ లేదు. తమ సొంత ప్రపంచాన్ని దాటి వేరే సమాజం ఉందనీ దానిని మెరుగుపర్చాల్సిన అవసరముందనీ గ్రహించినవాళ్లు ఎప్పుడూ కొందరే ఉంటారు. ఈ కొందరూ అనేక ఉద్యమాల మధ్య చీలి ఉన్నారు. ఇది కూడా సహజమే. దీనిలోనూ తప్పుపట్టాల్సిందేమీ లేదు.

ఈ కొందరిలో బాలగోపాల్ ఒకరు. వీరందరిలో కొన్ని లక్షణాలు తప్పనిసరిగా ఉంటాయని మనం అనుకుంటాం. ఉండాలని కోరుకుంటాం. సామాన్య జనం కంటే వీళ్ల అవగాహనా శక్తి మెండుగా ఉండాలని భావిస్తాం. వీరు సమాజాన్ని మెరుగుపర్చే కర్తవ్యాన్ని స్వీకరించారు కనుక దానికి సంబంధించిన వత్తిళ్లనూ సాధక బాధకాలనూ తట్టుకుని నిలబడతారని ఆశిస్తాం. 'సొంత అవసరాల'పట్ల వెంపర్లాటను కొంత కుదించుకుంటారనీ, సాదాగా బతుకుతూ ఉన్నతంగా వ్యవహరిస్తారనీ, సంకుచితత్వాన్ని వదిలేస్తారనీ ఆశిస్తాం. ఆ ఆశలు అత్యాశలు కాదు. అయినా వీటన్నిటినీ సంతృప్తిపరిచిన అతి తక్కువ మందిలో బాలగోపాల్ ఒకరు. అదే ఆయన ప్రత్యేకత.

నిజానికి సమాజ శ్రేయస్సు కోసం రంగంలో దిగినవారందరికీ బాలగోపాల్ ఒక సహజమయిన సగటు నమూనా అయి ఉండాల్సింది. కాని దురదృష్టం. అలా కానేలేదు. అందుకే ఆయన ఒక విశిష్టమైన నమూనాగా మిగిలాడు. సామాన్య జనాన్ని ఉద్ధరించడానికి పుట్టినట్లు నటిస్తున్న మనుషుల్లో అత్యధికులకు ఇవ్వాళ సహజమయిన సగటు నమూనా 'గిరీశం'. తొలి గిరీశం ఆవేల్టి సంస్కరణోద్యమంలో పుట్టాడు. అతగాడి మౌలిక తత్వం క్రెడిటూ డెబిటూ'. నయా గిరీశాలందరూ ఈ తత్వాన్ని ఆబగా అందిపుచ్చుకొన్నారు. వీరు ఆ తర్వాత వచ్చిన ప్రజా ఉద్యమాలన్నిటిలోనూ తామరతంపరగా చేరి నాయకత్వాలకు ఎగబాకారేమో అనిపిస్తుంది. అబ్బో ఎన్ని రకాల గిరీశాలో చెప్పలేం. కమ్యూనిస్టు గిరీశాలు, విప్లవ గిరీశాలు, దళిత గిరీశాలు, బడుగు గిరీశాలు, మైనారిటీ గిరీశాలు- ఒకటేమిటి మీరు ఏ ఉద్యమంలో చూసినా అందులో మీకు కుప్పలు తెప్పలుగా గిరీశాలు కనిపిస్తారు. గిరీశాలది చాలా 'విశాల' దృక్పథం. ఎంత విశాలమంటే నేటి ప్రగతిశీల ఉద్యమాలకూ ప్రగతి నిరోధక వాదాలకూ రెంటికీ వారే ప్రతినిధులు. గిరీశానికి కుల మత ప్రాంతీయ భేదాలు లేవు. అతగాడికి లింగభేదం ఉందనుకునేరు. కళ్లు తెరచి చూడాలేగాని మీకు లెక్కలేనంత మంది ఆడ గిరీశాలు కనిపిస్తారు.

నిజానికి సమాజ శ్రేయస్సు కోసం రంగంలో దిగినవారందరికీ బాలగోపాల్ ఒక సహజమయిన సగటు నమూనా అయి ఉండాల్సింది. కాని దురదృష్టం. అలా కానేలేదు. అందుకే ఆయన ఒక విశిష్టమైన నమూనాగా మిగిలాడు. సామాన్య జనాన్ని ఉద్ధరించడానికి పుట్టినట్లు నటిస్తున్న మనుషుల్లో అత్యధికులకు ఇవ్వాళ సహజమయిన సగటు నమూనా 'గిరీశం'. తొలి గిరీశం ఆవేల్టి సంస్కరణోద్యమంలో పుట్టాడు. అతగాడి మౌలిక తత్వం క్రెడిటూ డెబిటూ'. నయా గిరీశాలందరూ ఈ తత్వాన్ని ఆబగా అందిపుచ్చుకొన్నారు.

ఈ డెబిటూ క్రెడిటూ తత్వాన్ని, ఈ గిరీశతత్వాన్ని నూటికి నూరుపాళ్లూ తిరస్కరించిన అతి కొద్దిమందిలో బాలగోపాల్ ఒకరు. అదే ఆయన విశిష్టత. ఆ పని ఆయన పూర్తి స్పృహతో తెలిసే చేశాడనిపిస్తుంది. ఆయనలో డబ్బు యావ ఉన్నట్టుగా ఏనాడూ కనిపించలేదు. మామూలుగా జనం కోరుకునే సౌఖ్యాలమీద ఆయనకు పిసరంతయినా మోజు ఉన్నట్టుగా చూసినవారు లేరు. బహుశ ఈ సౌఖ్యాల కంటే మించినది ఏదో ఆయనకు తన పనిలో కనిపించి ఉంటుంది. లేదంటే బంగారం లాంటి ఉద్యోగం వదిలిపెట్టి ఈ పనిలో దిగి ఉండడు. దేవుడి సేవలో ఇహలోక సౌఖ్యాలను మించిన పారలౌకిక ఆనందాలలో తేలి తన్మయత్వాన్ని పొందే కొందరు భక్తుల్లాగా, ఆయనకు తన సామాజిక కార్యకలాపాల్లో గిరీశాలకు అంతుబట్టని ఏదో అటువంటి ఆనందాన్నో సంతృప్తినో పొందుతూ ఉండవచ్చు. నిజానికి జనం బతుకుల్ని మెరుగుబర్చడం కోసమో స్వేచ్ఛ కోసమో ప్రజాస్వామ్యం కోసమో ఇంకేదైనా ఉదాత్త ఆశయం కోసమో పని చేయడానికి రంగంలో దిగిన వారందరికీ ఈ 'ఆనందం' రుచి ఎంతో కొంత తెలిసే ఉండాలి. కాని బాలగోపాల్ ఎంత అరుదైన ఉదాహరణగా కనిపిస్తున్నాడో చూడండి. గిరీశాలు ఎంత విరివిగా కనిపిస్తున్నారో చూడండి. అది ఆయన ఔన్నత్యానికి నిదర్శనమని సంతోషించాలో, మన దౌర్భాగ్యానికి చిహ్నమని విచారించాలో తెలియదు.

ఆయన తొలి అడుగుల్లో రాజ్య హింసను తీవ్రంగా ద్వేషించాడు. మానవ హక్కులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ నిరంకుశత్వాన్ని బట్టబయలు చేశాడు. ఆ పని ఆయనతో పాటు ఎందరో చేశారు. ఎంతో ధైర్యంగా చేశారు. తర్వాత ప్రజల తరపున ఆయుధాలు ధరించామన్నవాళ్లు ప్రభుత్వం లాగే అమానుషంగా హేతువిరుద్ధంగా ప్రవర్తించగా చూశాడు. చూసి గమ్మున ఉండిపోలేదు. ఆ నిజాన్ని బాహాటంగా చెప్పాడు. ప్రభుత్వాన్ని ఎంతగా నిందించాడో అంతగానూ తన పాత మిత్రులను తప్పుపట్టాడు. వారితో అంతకుముందు తనకున్న ప్రత్యేక బంధాన్ని ఒదులుకున్నాడు. ఆయన విశిష్టత అన్నది ఇందులోనే. ఇది చాలా కష్టమైన పని. సాయుధులు ఈయన్ని చంపుతారని కాదు. ఆ భయం ఉంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంత నిక్కచ్చిగా నిలబడేవాడు కాదు. ఇక్కడ ఉన్న ప్రత్యేక కష్టమేమంటే, తనని అభిమానించేవాళ్లూ తనని ప్రోత్సహించినవాళ్లూ అందరూ ఆ విప్లవ సంస్థలోనే ఉన్నారు. వారికి వ్యతిరేకంగా తనకి స్పష్టంగా కనిపించిన నిజాలను బయటపెట్టడం అందుకే మరింత కష్టం. అయినా ఆయన తన అంతరాత్మను జోకొట్టలేదు. ఆ నిజాన్ని ఆయన బయట పెట్టనే పెట్టాడు.

ఒక లక్ష్యాన్ని సమర్థించడం వేరు. ఆ లక్ష్యం పేరుతో ఏర్పడ్డ సంస్థకు వకాల్తా పలకడం వేరు. వకాల్తాదారులకు నిజానిజాలతో సంబంధం లేదు. ఒక సత్యాన్వేషికీ ఒక లాయరుకీ ఉన్న తేడా అదే. సత్యమని మనసా వాచా కర్మల్లో నమ్మిన దాన్నే వాదించినప్పుడు మాత్రమే సత్యాన్వేషీ లాయరూ ఒకటవుతారు. ఆయన జీవితంలో ఎప్పుడూ నిజాన్నిబట్టి నమ్మకాలు ఏర్పరచుకున్నాడు. ఆయన తన నమ్మకాలను బట్టి నిజాలను మార్చలేదు. ఆయన సత్యాన్వేషి.

పాత రాజకీయ సంస్థలను కాసేపు విస్మరిద్దాం. కొత్తగా ఓ స్వచ్ఛమైన రాజకీయ సంస్థను నెలకొల్పాలని కోరేవారెవరైనా బాలగోపాల్ రాజకీయ తాత్వికతతో ఏకీభవించవచ్చు. ఏకీభవించకపోవచ్చు. కాని ఆయన సత్యాన్వేషణా స్ఫూర్తినీ, ఆయన నిజాయితీని, తను నమ్మిన దానికి కట్టుబడి ఉండే ఆయన నిబద్ధతనూ స్వీకరించాల్సిన అవసరం ఉంది. ఈ లక్షణాలను సంస్థ మొత్తంగానూ స్వీకరించాలి. అందులోని విడి వ్యక్తులుగానూ పుణికి పుచ్చుకోవాలి. సంస్థను గిరీశాలకు సాధ్యమైనంత దూరంగా ఉంచాలి. కాదంటారా?

మానవ కళ్యాణం కోసం పని చేసిన వారి అస్థికలు, ఉత్తమ మానవుల వెచ్చటి కన్నీళ్లతో పునీతమవుతాయంటాడు మార్క్స్. బాలగోపాల్‌ని స్మరిస్తూ, వెచ్చటి కన్నీళ్లతో...

ఎ.గాంధీ । సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్